సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 20 । మే । 2025



సమస్యల పరిష్కారానికి చర్యలు..
ప్రజావాణిలో 96 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.
- 8లో ▸



బ్రిడ్జీలు నిర్మించారు..
తాడ్వాయి మండలంలో రెండు వంతెనలు నిర్మించినా.. తారురోడ్డు వేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /23.6

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కేసుల విచారణలో నాణ్యత ముఖ్యం



కామారెడ్డి క్రైం: నాణ్యతతో కూడిన కేసుల విచారణ చేపట్టాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయా పోలీస్ స్టేషన్ల రైటర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, విచారణ, పరిశోధనలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. ముఖ్యంగా సీసీటీఎన్ఎస్‌లో కేసులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అయ్యేలా చూడాలన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీట్ వరకు అన్ని వివరాలు సమగ్రంగా, స్పష్టంగా నమోదు చేయాలని, ఒక్క అంశంలో కూడా తప్పులు దొర్లకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి రైటర్‌కు ఉందని తెలిపారు. బాధితుడికి న్యాయం జరిగేలా విచారణ సాగాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు మంచి పేరు తేవాలి



కామారెడ్డి క్రైం : నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. రెండు నెలల క్రితం మృతి చెందిన ఇద్దరు పోలీసుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను సోమ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వడ్ల రవి భార్య సౌఖ్య, అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ కూతురు మానసలకు జూనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, కార్యాలయ ఏవో అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ మొక్కల పరిశీలన



బీబీపేట : యాడారంలో పట్టు పురుగుల సాగు కోసం పెంచుతున్న మల్బరీ మొక్కలను సోమవారం జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశ్రమతో తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడి ఆశించవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట డివిజన్ ఉద్యాన అధికారి సంతోషి రాణి, జిల్లా పరిశ్రమల అధికారి అయిలయ్య తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షలకు 508 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం మూడో రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో 7,680 మంది విద్యార్థులకు 7,172 మంది హాజరు కాగా 508 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7,112 మంది విద్యార్థులకు 6,670 మంది హాజరు కాగా 442 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 568 మంది విద్యార్థులకు 502 మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై నైపుణ్య శిక్షణ

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో గ్రామీణ యువ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ భరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి జూన్ 1వరకు శిక్షణ ఇస్తామని.. వారం రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు 23లోగా ఆత్మ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లొస్తున్నారు!

- రిజిస్ట్రేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు
- త్వరలో సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సర్వేయర్ల కొరతను అధిగమించడానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆసక్తిగలవారినుంచి దరఖాస్తులు స్వీకరించిన సర్కారు.. వారికి ఈనెల 26 నుంచి శిక్షణ ఇవ్వనుంది. త్వరలోనే వారి సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.



కామారెడ్డి క్రైం : భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లావాదేవీలు మరింత పారదర్శకంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలను అమలు చేస్తోంది. రిజిస్ట్రేషన్‌ల సమయంలోనే రైతులకు ఇకపై భూమి కొలతలు, హద్దులు, వివరాలతో కూడిన మ్యాప్(స్కెచ్) కూడా అందించాలని నిర్ణయించింది. భూముల లావాదేవీలు మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా జరిగేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తోంది. ఈ విధానాన్ని త్వరలోనే అమలులోకి తీసుకురావడం కోసం ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించింది. మన జిల్లాకు 30 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను కేటాయించిన సర్కారు.. పక్షం రోజుల క్రితమే లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈనెల 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. సివిల్ సబ్జెక్టుతో ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అందులో అర్హులను ఎంపిక చేసి, ఈనెల 26 నుంచి సుమారు రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు. అనంతరం వారు క్షేత్ర స్థాయిలో సేవలందిస్తారు.

సర్వే మ్యాప్‌లతో రిజిస్ట్రేషన్‌లు..

లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానాన్ని అమలు చేయడం ద్వారా భవిష్యత్తులో భూములకు సంబంధించిన వివాదాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉంటాయని సర్కారు భావిస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం రైతుల పేర్లు, సర్వే నంబర్, విస్తీర్ణం లాంటి వివరాలతో మాత్రమే రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఆ భూమికి సంబంధించిన మ్యాప్ ఉండదు. కానీ లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వస్తే రిజిస్ట్రేషన్ కంటే ముందే భూమికి సంబంధించిన మ్యాప్(స్కెచ్) తయారు చేస్తారు. దానిని సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటేనే ఆమోదిస్తారు. ఈ మ్యాప్‌లోనే అన్ని వివరాలు ఉంటాయి. దీంతో ఇప్పుడున్న దానికంటే శాస్త్రీయమైన పద్ధతిలో రిజిస్ట్రేషన్‌లు జరిగే అవకాశం ఉంటుంది. భూ భారతితో పాటు సర్వే మ్యాప్‌ల రూపకల్పన కూడా ఒకే సమయంలో అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.

రైతులకు ఉపయోగకరం..

లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందులో 30 మందిని ఎంపిక చేసి, సుమారు రెండు నెలల(50 పనిదినాలు) శిక్షణ ఇవ్వనున్నారు. వీరి సేవలు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. రిజిస్ట్రేషన్‌లతో పాటు మ్యాప్ కూడా ఉంటే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– శ్రీనివాస్, ఏడీ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, కామారెడ్డి

విపత్తులపై అప్రమత్తం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- జిల్లా కేంద్రంలో నేడు మాక్‌డ్రిల్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పక్కన అదనపు కలెక్టర్ విక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: వర్షాకాలంలో విపత్తులు, వరదలు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. వర్షాకాలంలో ఎదురయ్యే విపత్తులపై అవగాహన కల్పించేందుకు మంగళవారం జిల్లాకేంద్రంలో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదలు వచ్చినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అప్రమత్తం చేయడం వంటి కార్యక్రమాలను మాక్ డ్రిల్ ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వం అందించే సహాయ, సహకారాలను గురించి ప్రజలకు వివరించాలన్నారు. అధికారులు తప్పనిసరిగా మాక్‌డ్రిల్‌లో పాల్గొనాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, డీపీవో మురళి, జిల్లా ఫైర్ అధికారి సుధాకర్, మున్సిపల్ కమిషనర్లు రాజేందర్, శ్రీహరి, మహేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

కామారెడ్డి క్రైం : రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వచ్చిన 41,547 దరఖాస్తులను పరిశీలన నిమిత్తం బ్యాంకులకు పంపించామన్నారు. వాటిలో 15,515 దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలించారన్నారు. మిగిలిన వాటిని రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్యాంకుల నుంచి సమాచారాన్ని వీలైనంత త్వరగా తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్, డీఆర్‌డీవో సురేందర్, బీసీ సంక్షేమ అధికారి స్రవంతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలి


ఆయిల్‌పాం మొక్కను నాటుతున్న అధికారులు

బీబీపేట: ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకు రావాలని, దాని వల్ల సుమారు 30 ఏళ్లవరకు ఆదాయం సంపాదించవచ్చని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. సోమవారం యాడారంలో హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ధర్మారెడ్డి రైతు పది ఎకరాల్లో 525 మొక్కలు నాటుతున్నారన్నారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయిల్‌పాం మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. జిల్లాలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ పెట్టడానికి హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీ కసరత్తు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన శాఖ అధికారి సంతోషిరాణి, అధికారులు వరుణ్, విజయ రామస్వామి, నసీం, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, తహసీల్దార్ సత్యానారాయణ, ఏవో నరేందర్, ఏఈవోలు సంతోష్, రమేష్, హెచ్‌యూఎల్ జనరల్ మేనేజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ జాడేది?

- వానాకాలం సమీపిస్తున్నా పంపిణీ చేయని సర్కారు
- ఆందోళనలో రైతులు



నిజాంసాగర్ : వానాకాలం సమీపిస్తున్నా జీలుగ విత్తనాల జాడ లేదు. జిల్లాకు 5 వేల క్వింటాళ్ల జీలుగ, 1,200 క్వింటాళ్ల జనుము విత్తనాలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు. నిజామాబాద్‌లో పంపిణీ చేసిన ప్రభుత్వం కామారెడ్డిలో ఎందుకు పచ్చిరొట్ట విత్తనాలను అందించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

భూసారం పెంచేందుకోసం ప్రభుత్వం ఏటా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యాభై శాతం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు సరఫరా చేస్తుంది. ఈ ఏడాది జిల్లాకు 5 వేల క్వింటాళ్ల జీలుగ, 1,200 క్వింటాళ్ల జనుము విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు సరఫరా చేయాల్సి ఉంది. విత్తనాల సరఫరాకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినా విత్తనాలు మాత్రం రావడం లేదు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికీ జనుము, జీలుగ విత్తనాలు రాకపోవడం, ప్రైవేట్ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిజామాబాద్‌లో పంపిణీ..

కామారెడ్డి జిల్లాకు జీలుగ, జనుము విత్తనాలను పంపణి సర్కారు.. నిజామాబాద్ జిల్లాకు మాత్రం పంపింది. నిజామాబాద్‌కు తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విత్తనాలు వచ్చాయి. వాటి పంపిణీ కూడా పూర్తయ్యింది. కానీ కామారెడ్డి జిల్లాకు మాత్రం విత్తనాలు పంపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పచ్చిరొట్ట విత్తనాల సరఫరాలో నేషనల్ సీడ్ కార్పొరేషన్ నిర్లక్ష్యం వహించడంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. పాలకులు స్పందించి త్వరగా విత్తనాలు సరఫరా చేయాలని కోరుతున్నారు.

రెండు, మూడు రోజుల్లో వస్తాయి

జీలుగ, జనుము విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ విత్తనాలు రావాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో జిల్లాకు పంపిస్తామన్నారు.

–తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సైన్యం పరాక్రమానికి ప్రతీక సిందూర్


జిల్లా కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

- మోదీ పాలనలో దేశం సురక్షితం
- తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: భారత సైన్యం పరాక్రమానికి ప్రతీక అపరేషన్ సిందూర్ అని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం మన దేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్థాన్, పీవోకేలలోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాకేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. గాంధీ గంజ్ వద్ద ప్రారంభమైన ర్యాలీ.. పుర వీధుల మీదుగా సాగింది. జాతీయ జెండాలతో పాటు ఆపరేషన్ సిందూర్ ప్లకార్డులు, మోదీ కటౌట్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తి చేసి పాకిస్తాన్‌పై విజయం సాధించినందుకు త్రివిధ దళాలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ సైనికుల వీరత్వాన్ని, త్యాగాన్ని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. దేశ ప్రజలు వారికి రుణపడి ఉంటారన్నారు. మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉందన్నారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్, రంజిత్ మోహన్, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

వర్షాలతో ఆగమవుతున్న రైతన్న


వర్షానికి తడుస్తున్న వడ్లు

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంతోపాటు మండలంలోని దేవునిపల్లి, లింగాపూర్, అడ్లూర్, చిన్నమల్లారెడ్డి, గర్గుల్ తదితర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. కుప్పలు చేసే లోపే వడ్లు తడిసిపోయాయి. వరద నీటిలో కొట్టుకుపోయాయి. వడ్లను 15 రోజుల క్రితమే తీసుకువచ్చినా తూకం వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేగంగా తూకాలు వేయాలని కోరుతున్నారు.




కామారెడ్డి గాంధీ గంజ్‌లో వరద నీటిలో కొట్టుకుపోతున్న వడ్లను ఎత్తుతున్న రైతులు

నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్

కామారెడ్డి టౌన్: రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోలలో మంగళవారం డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఆర్ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఆర్టీసీలో సమస్యలపై ఫిర్యాదు చేయడంతోపాటు సేవల మెరుగుదలకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు..

అధికారి	ఫోన్ నంబర్
రీజనల్ మేనేజర్, నిజామాబాద్	99592 26011
డిపో మేనేజర్, కామారెడ్డి	99592 26018
డిపో మేనేజర్, బాన్సువాడ	99592 26020
డిపో మేనేజర్, నిజామాబాద్-1	99592 26016
డిపో మేనేజర్, నిజామాబాద్-2	99592 26017
డిపో మేనేజర్, బోధన్	99592 26001
డిపో మేనేజర్, ఆర్మూర్	99592 26019

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి


మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం స్కూల్ బస్సుల డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురి కాకుండా డ్రైవర్లు, యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు దాటే క్రమంలో పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. బస్సులకు మరమ్మతులు ఏవైనా ఉంటే ముందుగానే చేయించుకుని ఫిట్‌నెస్ ధ్రువీకరణ చేసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం బస్సులు నడపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో అడ్మిషన్లు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బానోత్ రాజు, నాగసూర విగ్నేశ్, సిద్ధార్థ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. వీరు ఈ నెల 21 వరకు మెదక్‌లో జరిగే 11వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కనక రవి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉత్కం శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, భూమేశ్, వినోద్, సాయిరెడ్డి, గంగారెడ్డి అభినందించారు.

నేటి నుంచి రెండో విడత టీచర్లకు శిక్షణ

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ఉపాధ్యాయులకు రెండో విడత శిక్షణా కార్యక్రమం ప్రారంభమవుతుందని డీఈవో అశోక్ తెలిపారు. సోమవారం రెండో విడత టీచర్ల శిక్షణకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని బోర్గాం(పీ) జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రెండో విడత టీచర్ల సమావేశం ఐదురోజుల పాటు కొనసాగుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు సెంటర్ ఇన్‌చార్జీలు చేసుకోవాలని సూచించారు. రీసోర్స్ పర్సన్లు సెషన్ వారీగా అంశాలపై తగిన టీఎల్‌ఎం తయారు చేసుకొని ప్రిపేర్‌కావాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రైనింగ్‌కు ముందు, కొనసాగే సమయం, ట్రైనింగ్ తర్వాత విషయాలను వివరించారు. ఆర్పీలు శిక్షణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

బ్రిడ్జీలను నిర్మించారు.. రోడ్డును మరిచారు

- తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి, కాలోజీవాడి శివార్లలో నిర్మాణం
- తారు రోడ్డు వేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బ్రాహ్మణపల్లి శివారులోని బ్రిడ్జి వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



కాలోజీవాడి శివారులో కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వద్ద అధ్వానంగా తయారైన రోడ్డు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి, కాలోజీవాడి శివార్లలోని రహదారుల మధ్యలో రెండు బ్రిడ్జీలను నిర్మించారు. బ్రిడ్జిలకిరువైపులా తారు రోడ్డు వేయకుండా అలాగే వదిలేశారు. ఈరోడ్డు గుండా నిత్యం వెళ్లే వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మొరం వేయడంతో కొద్దిపాటి వర్షానికే తొలగిపోయి గుంతలయంగా మారుతున్నాయి. దీంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారు. వర్షాకాలంలో కాలోజీవాడి, బ్రాహ్మణపల్లి శివారులో ఉన్న వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండేవి. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న ఐదు గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం, మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. 2023లో ప్రభుత్వం బ్రాహ్మణపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.50 కోట్లు, కాలోజీవాడి నిర్మాణానికి రూ. 2.10 కోట్ల నిధులను మంజూరు చేసింది.వెంటనే అధికారులు పనులను ప్రారంభించారు. గతేడాది రెండు బ్రిడ్జిల నిర్మాణాలను పూర్తిచేశారు. సదరు కాంట్రాక్టు బ్రిడ్జిలపై తారు రోడ్డు వేయడం కుండా మట్టిమొరం పోసి వదిలేశారు. పక్కనే ఉన్న భిక్కనూరు మండలంలో ఆరునెలల క్రితం ప్రారంభమైన బ్రిడ్జిలను పూర్తి చేసి బీటీవేశారు. ఇక్కడ మాత్రం మధ్యలోనే ఆపేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జిల వద్ద తారు రోడ్డును వేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదు

రెండు బ్రిడ్జిలను నిర్మించిన కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. సదరు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు విడుదల చేసిన వెంటనే బ్రిడ్జిల వద్ద ఉన్న తారు రోడ్డు వేసేలా చూస్తాం.

– రవితేజ, ఆర్‌అండ్‌బీ ఏఈ, తాడ్వాయి

అధికారులు పట్టించుకోవాలి



రెండు బ్రిడ్జిల వద్ద తారు రోడ్డును వేయించాలి. అధికారులు పట్టించుకోవాలి. ఈరోడ్డుపై ఆటో డ్రైవర్లు కూడా రావాలంటే భయపడుతున్నారు. ఇతర గ్రామాలకు వెళ్లాలంటే కిలో మీటరు వరకు కాలినడకన వెళ్లి ఆటోలో ఎక్కి వెళ్లాల్సి వస్తుంది.

– ఏలేటి చంద్రారెడ్డి, కాలోజీవాడి

మొరం కొట్టుకు పోయింది



వివిధ పనుల నిమిత్తం కామారెడ్డి, తాడ్వాయికి తరచుగా వెళ్తాం. కొత్తగా వేసిన బ్రిడ్జిల వద్ద తారురోడ్డుకు బదులుగా మొరం వేయడంతో వర్షానికి మొరంకొట్టుకు పోయింది. ఐదు గ్రామాల ప్రజలు ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం ఈరోడ్డు గుండా వెళ్తుంటాం. వర్షం పడితే ఇబ్బందులు పడుతున్నాం.

– బత్తులస్వామి, బ్రాహ్మణపల్లి

తారు రోడ్డుగా మార్చాలి



వర్షాకాలం ప్రారంభం కాక ముందే బ్రాహ్మపల్లి, కాలోజీవాడి శివార్లలో ఉన్న రెండి బ్రిడ్డిల వద్ద తారు రోడ్డును వేయాలి. ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పట్టించుకోని సమస్యలు తీర్చాలి.

– రాజిరెడ్డి, కాలోజీవాడి

మెరుగైన బోధనే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ

- ఎస్జీటీలకు నేటి నుంచి 24వ తేదీ వరకు..
- ఎస్‌ఏలకు 3 దశల్లో ట్రైనింగ్



బాన్సువాడలోని మండల విద్యావనరుల కేంద్రం

బాన్సువాడ రూరల్: విద్యాబోధనలో నైపుణ్యాలను పెంచేలా జిల్లాలోని గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. మంగళవారం నుంచి 24వ తేదీవరకు టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన జిల్లా రిసోర్స్ పర్సన్స్ వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. వివిధ సబ్జెక్టుల బోధనను మెరుగు పర్చుకునేలా జీవన నైపుణ్యాలు లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంపుదలకు ఈశిక్షణ తోడ్పడనుంది.

కామారెడ్డి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు లేదా ఎంఈవోలు సూచించిన పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఐదు రోజుజుల పాటు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీరికి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుంది. మధ్యాహ్న భోజన వసతి, టీ, స్నాక్స్ కూడా అందజేయనున్నారు. విధిగా ఉపాధ్యాయులంతా శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది.

25 మండలాల్లో శిక్షణ..

జిల్లాలోని 25మండలాల్లో మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో మండల స్థాయిలో ఎస్జీటీలు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు రెండోవిడత శిక్షణ ఈనెల 20 నుంచి 24 వరకు ఇవ్వనున్నారు. సుమారు 2500మంది టీచర్లు శిక్షణలో పాల్గొననున్నారు. మరో సుమారు 2వేల మంది గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లకు కామారెడ్డి జిల్లాకేంద్రంలో 10సెంటర్లలో అలాగే బాన్సువాడలో 4చోట్ల శిక్షణ కొనసాగనుంది. 27 నుంచి తుది విడత శిక్షణ నిర్వహించనున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు నిజామాబాద్‌లోని డైట్ కాలేజీలో శిక్షణ కొనసాగిస్తున్నారు.

ప్రధానాంశాలు..

ఉపాధ్యాయులకు శిక్షణలో భాగంగా ఎఫ్‌ఎల్‌ఎన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), డిజిటల్ పాఠాలపై లర్నింగ్ అవుట్ కమ్స్, లైఫ్‌స్కిల్స్, తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. జిల్లాస్థాయిలో ఇటీవల శిక్షణ పొందిన మండల స్థాయి రిసోర్స్ పర్సన్లు ఈ ఉపాధ్యాయులకు గుర్తించిన శిక్షణ ఇవ్వనున్నారు. మండల విద్యాశాఖాధికారులు గుర్తించిన శిక్షణ కేంద్రాల్లో శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులు టెక్స్ బుక్స్ వెంట తీసుకుని రావాల్సి ఉంటుంది. అలాగే స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ కొరకు ఐఫోన్ బదులుగా అండ్రాయిడ్ ఫోన్ వెంట తీసుకుని వస్తే అందులో రోజువారి అస్సెస్మెంట్ మరియు ఎవల్యూయేషన్ ఉంటుంది.

4,500 మందికి శిక్షణ



కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు విడతల్లో సుమారు 4500 మంది ఉపాధ్యాయులకు ఆయా సబ్జెక్టులపై వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. ఎంఈవోల పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతుంది. ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలి. హాజరు కాని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

– రాజు, డీఈవో, కామారెడ్డి

కూలిన డంపింగ్ యార్డ్



కన్నాపురం తండాలో కూలిపోయిన డంపింగ్ యార్డ్

రామారెడ్డి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కన్నాపురం తండా డంపింగ్ యార్డు కూలిపోయింది. డంపింగ్‌యార్డు నిర్మాణంలో నాణ్యతలోపం కారణంగానే కూలిపోయిందనే అనుమానాలు తలెత్తున్నాయి. కూలిపోయిన రేకులను కూడా పట్టించుకునేవారు కరువయ్యారు. మండల వ్యాప్తంగా డంపింగ్ యార్డులను వినియోగించకపోవడంతో వృథాగా ఉంటున్నాయి. మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 96 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ద్వారా దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణికి 96 ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్ల మంజూరు తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. త్వరితగతిన తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించడం గాని, పరిష్కార మార్గాలు చూపడం గాని చేయాలన్నారు. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలపై దరఖాస్తుదారుడికి రాతపూర్వకంగా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిఫ్‌కోర్టులో విచారణకు హాజరుకాని ఇద్దరు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. లింగంపేట మండలంలోని రాంపూర్ తాండకు చెందిన ధనావత్ రమేశ్, బాన్సువాడ మండలం కొయ్యగుట్టకు చెందిన మక్కల గంగాధర్ కోర్టు విచారణకు హాజరుకాకపోవడంతో వీరిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. దీంతో ఇద్దరిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చి అనంతరం కామారెడ్డి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మమార్గంలో నడవాలి

- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రజలంతా ధర్మమార్గంలో నడవాలని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రధానంగా యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. సోమవారం డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తనది నిర్మల్ జిల్లా అయినప్పటికీ డొంకేశ్వర్ మండల చుట్టు పక్కల గ్రామాల్లో బంధువులు ఉన్నారని, నికాల్‌పూర్‌లో కూడా ఉన్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. చివరి రోజు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అభిషేకం, కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి రెడ్డి, రావుల సుభాష్, భీమ్‌నాయక్, సుమన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోపాల్: మండలంలోని మంచిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. 17 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు.. ఆత్మీయంగా పలకరించుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు.

క్రైం కార్నర్

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ సీజ్



ఇందల్వాయి: మండలంలోని కొటాల్‌పల్లి బీట్ పరిధిలోని 593 కంపార్ట్‌మెంట్‌లో అక్రమంగా, అనుమతి లేకుండా అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్‌ఆర్‌వో రవి మోహన్ భట్ తెలిపారు. పోడు పట్టాలు లేకుండా, అటవీశాఖ అనుమతులు లేకుండా భూమిని ఆక్రమిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్షన్ అధికారి భాస్కర్, బీట్ ఆఫీసర్లు ప్రవీణ్, దిలీప్, పోచయ్య, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

సిరికొండలో రెండు ట్రాక్టర్లు..



సిరికొండ: మండలంలోని రావుట్ల బీట్ పరిధిలోని జంగిలోడి తండా, చింతల్ తండా అటవీ ప్రాంతంలో అటవీ భూమిని అక్రమంగా దున్నిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం సోమవారం తెలిపారు. ట్రాక్టర్లు జంగిలోడి తండాకు చెందిన గుగ్లోత్ గంగాధర్, బనావత్ మదన్‌లవని ఆయన పేర్కొన్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు.

ఐదుగురికి జైలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో నిబంధనలు అతిక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్న నలుగురితోపాటు మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఓ వ్యక్తికి బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి జైలు శిక్షను విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణ పరిధిలోని దాబా, హోటల్, దుకాణాల యజమానులు నలుగురికి రెండు రోజుల జైలు, తాగి వాహనం నడిపిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షను విధించారని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కల్కినగర్ కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన నీళ్ల సాయినాథ్ ఈ నెల 18న ఇంటికి తాళం వేసి తన కుటుంబంతో తీర్థయాత్రలకు వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. వెంటనే దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీరువాలో దాచి ఉంచిన రెండు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు అపహరణకు గురైంది. అదే భవనం పైఅంతస్తులో నివాసం ఉండే పెంటయ్య ఇంట్లో కూడా ఇదే తరహాలో చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

పిట్లం(జుక్కల్)/ లింగంపేట(ఎల్లారెడ్డి): పిట్లం, లింగంపేట మండలాల్లో విద్యుదాఘాతానికి రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి. పిట్లం మండలంలోని సీతారం తాండలో ఆదివారం సాయంత్రం గాలి దుమారానికి 11 కేవీ విద్యుత్ లైన్ తెగి గేదె మీద పడటంతో షాక్‌తో గేదె మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మెగావత్ లింబాజీ కోరారు. లింగంపేట మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన పిన్నూరి లక్ష్మన్‌కు చెందిన పాడి గేదె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారులో గేదె మేతకు వెళ్లగా విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌తో మృతి చెందిందని, గేదె విలువ రూ. 50 వేలు ఉంటుందన్నారు. ట్రాన్స్‌కో అధికారులు నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరారు.

మనస్పర్థలతో భార్యను కడతేర్చిన భర్త

- పిల్లల ఎదుటే దారుణం



అంజలి (ఫైల్)




ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

ఆర్మూర్‌టౌన్: కట్టుకున్న భార్యను కన్నపిల్లల ఎదుటే గొంతుకోసి హతమార్చిన ఘటన ఆర్మూర్ పట్టణంలో సోమవారం కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ అలియాస్ గంగారెడ్డికి జగిత్యాల జిల్లా మొగిల్‌పేట్ గ్రామానికి చెందిన అంజలి(35)తో 16ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గంగారెడ్డి జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్తూ వస్తుండేవాడు. గంగారెడ్డి–అంజలి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకుల కోసం బోధన్ కోర్టును ఆశ్రయించగా ప్రస్తుతం కేసు నడుస్తోంది. గొడవల కారణంగా అంజలి తన ఇద్దరి కూతుళ్లతో కలిసి 20 రోజుల క్రితం ఆర్మూర్ పట్టణంలో నివాసముంటుంది. కేసు నిమిత్తం అంజలి కూతుళ్లతో కలిసి సోమవారం బోధన్ కోర్టుకు హాజరై తిరిగి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటోంది. భర్త గంగారెడ్డి ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడి ఆమెపై కత్తితో దాడి చేశాడు. అడ్డుకున్న పిల్లలను తోసేసి అంజలి గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. పిల్లల అరుపులు విన్న ఇంటి యజమాని విషయం తెలుసుకునేందుకు రాగా అతనిని సైతం తోసేసాడు. దీంతో గంగారెడ్డి బయటికి వెళ్లకుండా యజమాని ఇంటి గేటు మూసేసి గడియపెట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అంజలి అప్పటికే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని సీపీ సాయి చైతన్య, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

తన వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తుందనే అంజలిని భర్త గంగారెడ్డి అడ్డు తొలగించుకున్నట్లు సమాచారం. దుబాయిలో ఉంటున్న గంగారెడ్డి.. ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళతో కొన్నేళ్లుగా వివాహేతర బంధం కొనసాగిస్తున్నాడని భార్యకు తెలవడంతోనే గొడవలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. గొడవలు ముదిరి విడాకుల వరకు వెళ్లగా, కోర్టులో కేసు నడుస్తుండగానే అంజలిని గంగారెడ్డి హతమార్చాడు. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



రాకేశ్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన కొంకుల రాకేశ్(20) అనే డిగ్రీ విద్యార్థి సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన కొంకుల పోచవ్వ, గంగారాం దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన రాకేశ్ ఎల్లారెడ్డి పట్టణంలో ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఉపాధి కోసం తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. తమ్ముడు మధుతో కలిసి చదువుకుంటూ ఇంటి వద్ద ఉంటున్న రాకేశ్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడ్డాడు. ఆన్‌లైన్ గేమ్ ఆడటం ద్వారా రూ. 80 వేలు పోగొట్టుకున్నాడు. ఈ విషయం తండ్రికి తెలిసి మందలించాడు. అంతే కాకుండా రాకేశ్ తరచూ ఫోన్ మాట్లాడుతున్నాడని తండ్రి మరోమారు మందలించడంతో తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శివకుమార్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి దాడిలో కొడుకు మృతి



నిఖిల్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: తండ్రీకొడుకుల మధ్య గొడవ ఒకరి హత్యకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నిఖిల్ (24) కొన్ని నెలల క్రితం గల్ఫ్ వెళ్లి మూడు నెలల క్రితం తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి నిఖిల్ మద్యం, కల్లు లాంటి దురలవాట్లకు బానిసయ్యాడు. డబ్బుల కోసం నిత్యం తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి తండ్రి భాస్కర్‌తో గొడవ జరిగింది. భాస్కర్ ఆవేశంతో అక్కడే ఉన్న ఓ ఇనుప రాడ్డుతో నిఖిల్‌పై దాడి చేశాడు. నిఖిల్ తలకు బలమైన గాయం కావడంతో వెంటనే కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిఖిల్ సోమవారం మృతి చెందాడు. భాస్కర్‌పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

తాగి వాహనం నడుపొద్దు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మద్యం సేవించి వాహనాలు నడిపించొద్దని నస్రుల్లాబాద్ పీఎస్సై అరుణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. తాగి వాహనం నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కేసులు నమోదు చేస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన గుసక సిద్ధిరాములు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. సిద్ధిరాములు ఈ నెల 17న ఇంటి నుంచి కూలీ పనుల నిమిత్తం వెళ్లి, తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానీపేట గ్రామ శివారులోని పంట చేనులో బండరాళ్ల కోసం అమర్చిన జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భవానీపేట గ్రామానికి చెందిన దర్శనం సిద్ధిరాములు పంట చేనులో ఉన్న బండరాళ్లను తొలగించేందుకు జిలెటిన్ స్టిక్స్ అమర్చినట్లు సమాచారం అందడంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సీఐ రవీందర్, ఎస్సైలు వెంకట్రావు, రాఘవేంద్ర గ్రామానికి చేరుకొని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయగా 31 జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సిద్ధిరాములు భూమిని బాగు చేసుకునేందుకు జిలెటిన్ స్టిక్స్ అమర్చినట్లు తెలిపారు. కాగా, ఆదివారం జిలెటిన్ స్టిక్స్ పేల్చడంతో సబ్‌స్టేషన్‌కు ప్రమాదం తప్పిందన్నారు. పలు ఇళ్లు, వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు జిలెటిన్ స్టిక్స్ అమర్చిన వ్యక్తిని, పంట చేను యజమానిని అదుపులోకి తీసుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని గాజుల్‌పేట్ గురుద్వారా సమీపంలో స్పృహ తప్పిన గుర్తు తెలియని మహిళ (60 నుంచి 65) ఆస్పత్రిలో మృతి చెందినట్లు రెండో టౌన్ ఎస్సై తెలిపారు. వివరాలు తెలిస్తే 87126 59838 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.